# Sakshi

## బాబొచ్చినా.. జాబు రాలేదు!

**సాక్షి, హైదరాబాద్:** ''జాబు కావాలంటే... బాబు రావాలి. ఉద్యోగం లేని వారికి నెలకు రూ.2,000 నిరుద్యోగ భృతి ఇస్తాం..'' ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ వినిపించిన నినాదం ఇది. చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లయినా ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ మాటే ఎత్తడం లేదు. పైగా 25 వేల మంది ఉద్యోగాలను పీకేసి బజారున పడేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీలో 1,42,825 ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఆర్థిక శాఖ తేల్చింది. తాజాగా రిటైరయ్యే ఉద్యోగుల స్థానంలో ఏర్పడే ఖాళీలను కలిపితే ఈ పోస్టుల సంఖ్య మరింతగా పెరుగుతుంది. అయితే, టీడీపీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు వీటిలో ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదు. సర్కారు కొలువుల భర్తీపై సీఎం చంద్రబాబు అనధికారికంగా నిషేధం విధించారు. తమకు ఉద్యోగాలు కావాలంటూ రాష్ట్రంలో ఏకంగా 27.23 లక్షల మంది నిరుద్యోగ యువత తమ పేర్లను నమోదు చేసుకున్నారు. గతంలో జిల్లా కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వమే ఈ విషయాన్ని వెల్లడించింది. మరోవైపు ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువత ఏకంగా 20 లక్షల మంది ఉన్నారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. వీరి సంఖ్య ఏటా 50 వేల చొప్పున పెరుగుతోందని సర్కారే పేర్కొంది. అయినా, ఇప్పటివరకు ఒక్క ఖాళీని కూడా ప్రభుత్వం భర్తీ చేయలేదు.

**రాష్ట్ర విభజన సమయంలో మంజూరైన ఉద్యోగుల సంఖ్య, ఖాళీల వివరాలు**

| రాష్ట్ర స్థాయి కేటగిరీ | మంజూరైనవి | ఖాళీలు |
|---|---|---|
| గ్రూప్–1 | 552 | 184 |
| గెజిటెడ్ | 11,097 | 3,081 |
| నాన్ గెజిటెడ్ | 5,422 | 788 |
| లాస్ట్ గ్రేడ్ | 34 | 25 |
| **మల్టీజోనల్** | | |
| గ్రూప్–1 | 187 | 61 |
| గెజిటెడ్ | 2,496 | 699 |
| నాన్ గెజిటెడ్ | 1,210 | 424 |
| **జోనల్** | | |
| గెజిటెడ్ | 35,652 | 11,105 |
| నాన్ గెజిటెడ్ | 45,500 | 11,353 |
| లాస్ట్ గ్రేడ్ | 4 | 4 |
| **జిల్లా స్థాయి** | | |
| గ్రూప్–1 | 54 | 2 |
| గెజిటెడ్ | 7,327 | 863 |
| నాన్ గెజిటెడ్ | 3,86,283 | 82,760 |
| లాస్ట్ గ్రేడ్ | 1,75,186 | 22,519 |
| ఎయిడెడ్ | 26,617 | 8,957 |
| **మొత్తం** | 6,97,621 | 1,42,825 |

## వైద్యం.. సర్వం ప్రైవేట్‌పరం!

### ఆసుపత్రుల నిర్వహణ నుంచి తప్పుకుంటున్న ప్రభుత్వం

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీని ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై తాజాగా హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయకుండా ఔట్‌సోర్సింగ్‌కు అప్పగించి చేతులు దులుపుకోవడం సరికాదని పేర్కొంది. కీలకమైన వైద్య రంగంలో నర్సింగ్, పారామెడికల్ తదితర సేవలను ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వొద్దని తేల్చిచెప్పింది. నిజానికి సిబ్బంది నియామకాల్లోనే కాదు, ప్రభుత్వాసుపత్రుల్లో సేవలను కూడా రాష్ట్ర సర్కారు ఔట్‌సోర్సింగ్‌కే అప్పగిస్తోంది. ప్రభుత్వాసుపత్రుల నిర్వహణ నుంచి క్రమంగా తప్పుకుంటోంది.

**చిత్తూరు ఆసుపత్రి అపోలోకు:** ఇప్పటివరకూ రాష్ట్ర చరిత్రలో ఒక ప్రభుత్వాసుపత్రిని ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చిన దాఖలాలు లేవు. అలాంటిది చిత్తూరు జిల్లా ఆసుపత్రిని అపోలో యాజమాన్యానికి అప్పజెప్పారు. 33 ఏళ్లపాటు లీజుకిచ్చారు. మరికొన్ని జిల్లా ఆసుపత్రులనూ ఇలా ప్రైవేట్‌కు ఇవ్వడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ మొదలుకొని బోధనాసుపత్రి వరకూ రక్త పరీక్షల నిర్వహణను మెడాల్ అనే ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. సంచార వైద్యశాలలుగా పల్లెలకు వెళ్లే '104' వాహనాలను పిరమిల్ స్వాస్థ్య కు కట్టబెట్టారు. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య పరికరాల నిర్వహణను ఏటా రూ.36 కోట్లతో ప్రైవేట్‌కు అప్పజెప్పారు.

**ఆరోగ్య శాఖలో ఖాళీలు**

రాష్ట్రంలోని బోధనాసుపత్రులు, వైద్య కళాశాలలు, జిల్లా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలన్నింటిలో కలిపి ఖాళీగా ఉన్న పోస్టులు

| పోస్టులు | ఖాళీలు |
|---|---|
| డాక్టర్లు | 2,300 |
| నర్సులు | 8,500 |
| ఎంపీహెచ్ఏ | 2,500 |
| సీహెచ్ఓలు | 90 |
| రేడియోగ్రాఫర్ | 77 |
| అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్‌లు | 37 |
| సీనియర్ అసిస్టెంట్లు | 132 |
| జూనియర్ అసిస్టెంట్లు | 85 |
| ల్యాబ్ టెక్నీషియన్లు | 1,250 |
| అడ్మిన్ ఆఫీసర్లు | 18 |
| హెల్త్ ఎడ్యుకేటర్లు | 23 |
| టైపిస్టులు, ఇతరాలు | 250 |
| **మొత్తం** | 15,262 |